కథానిక

# దేముడే పుట్టాడు

—చావా శివకోటి



కొన్ని నమ్మకాలు మనుషుల మధ్య ప్రేమను పెంచుతాయి. కొన్ని నమ్మకాలు మనుషుల మధ్య ఆత్మీయతల్ని పెంచుతాయి. కొన్ని నమ్మకాలు మనుషుల్ని దేవుళ్ళుగా చేస్తాయి. నిజమేనా?



ఎర్ర ఎర్రటి పొద్దు మసకబారుతున్నది.

'ఏరు' గలగలా తుళ్ళుతూ మలుపుల్ని దాటి సాగుతున్నది.

పరమేష్ఠి పరవశించి ఆడేవేళ్ళ- వినిపించే ఢమరకనాదంలా గుండె గూటిని తాకి వినిపిస్తున్నది.

కొండకోనల నుంచి బైటపడిన సూరీడు- తన సుదీర్ఘ ప్రయాణానంతరం అలసి సొలసి పశ్చిమాద్రిని చేరుతూ గౌర ఎరువుదనాన్ని ఏటిపై పరచి- లయబద్ధంగా వినిపించే నీటి గలగలలకూ, కీచురాళ్ళ చప్పళ్ళకూ పరవశించి నేలలోకి చొరబడుతున్నాడు నేల అంచు నుంచి. ఎర్రముద్ద అటు ఇటు దొర్లుతుందేమోననిపించేలా ఉందప్పటి వైచిత్రి. కానీ నేలమాటుకు భద్రంగా దిగిపోయాడు.

'మరియదాసు' గబగబా నడిచే ప్రయత్నం చేస్తున్నాడు.

మోకాల క్రింద బాగా గాయమై రక్తం ఓదుస్తోంది. అడ్డుగా కట్టిన గుడ్డ తడిసి ముద్దయింది. రోడ్డెక్కాడు. అటు ఇటూ పారచూసాడు.

ఆసుపత్రికి చేరాలని అతని ప్రయత్నం.

'మరియదాసు'ని చూసి టౌనేపు వెళ్తున్న సైకలతను ఆపాడు.

'వెనక కూర్చోగలవా?' ఆపి అడిగాడు మనసుతో.

తల ఊపాడు మరియదాసు.

* * * * *

నేను వైద్యం ప్రారంభించి నాల్గు సంవత్సరాలయింది. నాకు మూడేళ్ళ నుంచీ మరియదాసు బాగా తెలుసు. ఆవేళ్ళ రాత్రవుతుండగా నేను ఆసుపత్రి నుంచి ఇంటికి బయలుదేరినప్పుడు దండం డాక్టరు బాబూ! అన్న మాట వినిపించి అటు చూశాను. అదే నేను మరియదాసును మొదటిసారి చూడడం- మనిషి దృఢంగా ఉన్నాడు.

ఛామనఛాయ. ఆకట్టుకొనే ముఖం. పంచను ఎగకట్టి బనీనుతో కనిపించాడు.

బయటకు వచ్చాను. మోకాలు క్రింది భాగాన రక్తం- కరవచ్చిగ కనిపించింది. గాయానికి కట్టిన గుడ్డనుంచి బయటికొచ్చి పాదం దాకా రక్తపు చారికలు

న్నాయి. 'అరే! ఏమిటిది! మొదట లోనికి పద! ఏం జరిగింది?' అంటూ భుజం పట్టుకొని లోనికి తీసికెళ్లాను. నర్సుని కేకేసి గుడ్డ విప్పి గాయాన్ని తుడిచి మందు వేసి డ్రస్ చేశాను. సెప్టిక్ కాకుండా ఇంజక్షనిచ్చాను. గొడ్డలితో తగిలిన గాయమది. ఎముక చిట్లలేదు గానీ బలంగా దిగి కండను చీల్చింది. నాల్గురోజులకు మందులు వ్రాసిచ్చాను.

'బాబూ! ఏమిచ్చుకోమంటరు?' అన్నాడు నావైపు చూస్తూ.

'నయం కానీయ్ చూద్దాం' అన్నాను నవ్వి భుజం తడుతూ.

'చెయ్యి పట్టుకొనకముందే ఫీజు తీసుకొనే ఈ రోజులలో–' అని నవ్వి రొండిన చెయ్యి పెట్టి డబ్బు తీశాడు.

'నేను చెప్పాను గదా! నువ్వు వెళ్లు. నాల్గు రోజుల తరువాత ఒకసారి వచ్చి చూపించుకొని వెళ్ళు' అని– బయలుదేరాను– గదులలోని రోగులను చూసేందుకు.

'డాక్టరు బాబూ!' అని దండం పెట్టి– 'నా పేరు మరియదాసు. నా పెళ్ళాం పోయి పదేళ్ళయింది. ఒంటరిగనే ఉంటన్న. నాకో బిడ్డ ఉంది. ఆరునెల్ల క్రితం పెళ్ళిచేసి అత్తారింటికి పంపిన అన్నాడు' వెంట నడుస్తూ.

అతని పేరు చెప్పడంలో అర్థం ఉంది గానీ– అతని గురించి ఎందుకు చెప్పాడో అర్థం కాలేదు. 'మంచిది' అని వెళ్ళిపోయాను.

* * * * *

అది మొదలు– కూలిపేటలో– ఎవరికేమైనా తీసుకొని వచ్చేవాడు.

అలా మరియదాసు– నాకు దగ్గరయ్యాడు.

ఒకనాడు– రాములమ్మ అనే ఆవిడను తీసుకొచ్చాడు.

'మరియదాసూ! బావున్నావా? కాలి గాయం పూర్తిగా నయమైంది గదా! ఇప్పుడు నొప్పి గాని లేదు గదా!' అని పలకరించాను.

'ఆ!' అని 'ఇది మా ముఠాలో పనిచేస్తది బాబూ! దీనికి లగ్నమై అయిదేళ్ళయింది. కడుపున ఓ కాయ కాస్తే బాగనుకుంటది. దీన్ని కట్టుకున్నోడికి ఏ ధ్యాసా లేదు. వచ్చిన కాడికి, కల్లు కొట్టు కాడనే తగలెట్టి ఇంటికి చేరి, దీని కష్టంతో, వండి వార్చింది, తిని, దీని ప్రక్కలో ముడుచుకుంటడు' అని ఆగి, రాములమ్మను చూసి ఇది 'బైట' ఉండే ముందు నాల్గు దినాలు కడుపు నొప్పితో మెలి తిరిగిపోతది– ఆడివేవీ పట్టించుకోదు! తమరైతే సరిపోతదని ఇట్టవచ్చిన కూస్త చూసిపెట్టండి' అన్నాడు.

'మంచిది' అని నా గదిలోకెళ్ళాను.

నల్గురు రోగుల తర్వాత– రాములమ్మ లోనికొచ్చింది. వయస్సు పాతికలోపు ఉంది. నీటుగ లేదు కానీ నిగారింపు ఉంది. నవ్వు ముఖమే! కాయకష్టపు కావురుకు మసకబారి ఉంది. గట్టిగా ఉండి ఆడతనము నిండి ఉన్న శిలాప్రతిమలా ఉంది.

!కూర్చో' 'నీ పేరు' అడిగాను.

'రాములమ్మ' అని మెల్లిగా చెప్పింది.

కూర్చునేందుకు సిగ్గుపడి బెరుకుగా చూసింది.

'నువ్వు ఇక్కడ కూర్చోకపోతే పరీక్షించడం ఎలా?' అన్నాను.

సర్దుకొని నెమ్మదిగ కూర్చుంది. భయం బిడియం కనిపించింది. అవి రెండూ కల్సిన క్షణాన రాములమ్మ ముఖం వింత అందాన్నిచ్చింది.

'చెయ్యి ఇటివ్వు' అన్నాను.


ఇచ్చింది భీతహరిణిలా కనురెప్పల్ని గబగబా మూస్తూ.

మట్టికొట్టుకొని ఉన్న గాజులు వెనక్కి జరిపి నాడి చూశాను.

'ఏమిటి బాధ' అని అడుగుతూ–

దించిన తల నుంచి కళ్ళు మలిపి భయంగా చూసింది.

'నీకు నేను వైద్యం చేయాలంటే నీ బాధేమిటో తెలియాలి కదా! లేకుంటే మందులేమిచ్చేది' అన్నాను.

'చెప్పింది గబగబా! పాఠం అప్పగించే బడిపిల్లలా- కళ్ళు గట్టిగా మూసుకొని.

'అలా కాదు- వివరంగా చెప్పాలి' అని స్టెత్‌తో నా పని ప్రారంభించాను. మట్టివాసన- ముక్కుపుటాలకు తగిలింది.

బయట ఉన్నరోజులప్పటి స్థితి చెప్పేందుకు సిగ్గుపడింది కానీ చెప్పింది సిగ్గుతో చితికిపోయి- నెమ్మదిగ వివరాలు సేకరించి- పదిహేను రోజులకు మందులు వ్రాసిచ్చాను- ఇవి వేళ్ళ ప్రకారం వాడు- తగ్గుతుంది అని చెప్పి.

చిట్టీ తీసుకొని వెళ్ళింది . రాములమ్మ నడకలో కూడా 'నయగారాలు కనిపించినయి.

అంతఃపురాలలోనే ఈ రాములమ్మ పుట్టి ఉంటే ఎందరి గుండెల్లో గుబుల్ను రేకెత్తించేదో? ఎందరికి ఆరాధ్య దైవమయ్యేదో అనిపించింది.

వెళ్ళే ముందు మరియదాసు వచ్చి 'ఇకపోత బాబూ' అని దండం పెట్టి వెళ్ళిపోయాడు.

* * * * *

'దండం డాక్టరుబాబూ!' అన్న మాట వినపడగనే 'మరియదాసొచ్చాడు' అనిపించింది.

'బావున్నావా?' అని పలకరించాను

'మీరు చల్లంగ చూస్తుంటే మాకేటైతది బాబూ!' అన్నాడు నవ్వుతూ- నిండుగా ఉంటుంది మరియదాసు నవ్వు! అతని వెనక ఓ ఆడకూతురు పసిబిడ్డతో కనిపించింది.

'ఈ బాబు దేముడు. పసిదాని చేయి పట్టుకుంటే చాలునే! జొరం మాయమై పోతదని చెప్తే విన్నావా!' అంటూ నా ముందుకు పంపాడు.

నేను మరియదాసు మాట వింటూ ఆవిడ వైపు చూసాను. చాలా మొరటుగా, ఆడతనం కనిపించనంత ఇదిగ ఉంది. చానా ఆరోగ్యంగా కనిపించింది. పసిదాని దగ్గరికెళ్ళి చూశాను.

నిజంగా బంగారు మొలకే పసిది! అనుకొని- నిజంగా ఈ పసిది ఈవిడ సంతానమేనా? అన్న అనుమానానికి లోనయ్యాను. ఒళ్ళు పేలిపోతున్నది. పరీక్ష చేసి మందులు వ్రాసిచ్చాను.

'ఉగ్గుపాలతో కలిపి పొయ్యి తగ్గిపోతది' అని పంపాను.

'అలాగే'నంటూ 'ఇకవెళ్తామయ్యా' అని దండం పెట్టాక మరియదాసు- కృతజ్ఞత నిండిన నవ్వు అతగాని మొఖాన చెదరక కనిపించింది.

* * * * *

మరో అయిదారు మాసాలు గడిచినయి.

ఈ మధ్యన కూడా మరియదాసు ఎవర్నో ఒకర్ని తీసుకొని వస్తూనే ఉన్నాడు.







నా హస్తవాసి మంచిదనే భావే పల్లెజనానికి కల్గడంతో ప్రాక్టీసు బాగా పెరిగింది.

న్యాయానికి నేనిక్కడ ప్రాక్టీసు ప్రారంభించే ముందు చాలామంది 'అక్క డెందుకూ' అన్నారు.

ధైర్యం చేసినందుకు బాగానే ఉంది. బాగా అభిమానించే వారూ దొరికారు. మనిషికి అంతకన్నా కావల్సిందేముంది. ఆ వేళ్ళ ఆదివారం.

సాయంత్రం నాల్గున్నర గంటలదాకా ఆసుపత్రిలోనే సరిపోయింది.

ఇంటికి వెళ్తూ- మధ్యన రెండు ఇళ్ళకు కూడా వెళ్ళి- రోగుల్ని చూసి వచ్చాను.

దాదాపు అయిదయింది. భోంచేయాలనిపించింది.

'మంచి టీ పెట్టవోయ్' అన్నాను ఇల్లాలితో

'భోంచేయరా' అంది దగ్గరకొస్తూ.

'నో-' అన్నాను 'రిలాక్స్'గా కూర్చొని

'మంచిది' అని లోపలికెళ్ళి 'టీ'తో పాటు నాల్గు బిస్కట్లు తెచ్చి ముందుంచింది. తనూ ఎదురుగ కూర్చుని.

బిస్కట్లు నములుతూ- టీ త్రాగి- 'ఇదిగో నువ్వు టీ చాలా బాగా చేస్తావోయ్' అన్నాను కళ్లలోకి చూసి మెచ్చుకోలుగా.

'కాశీమజిలీ కథలు మీరు చదివే ఉంటారు' అంది మూతి బిగించుకొని నవ్వుతూ.

'నువ్వు ఇప్పడు చదువుతున్నావా ఏంటి?' అని చెయ్యి పట్టుకొన్నాను.

'మీరు ఆ కథల గురించి ఒకసారి చెప్పింది గుర్తుకొచ్చి అడిగా' అంది తన చేతిని జారగుంజుకుంటూ.

'మనిషికి హితవు చెప్పే కథలవి. వాటి ప్రయోజనం అపారమైంది. మళ్ళీ చదువు! బావుంటాయి' అన్నాను.

తల ఊపింది- లోనికి నడుస్తూ- ఎంత ఇల్లాలయినా- ఈ నడకన నాజూకుతనం కనిపించలేదు.

అలా చూస్తుండగానే కన్ను మలిగింది.

కళ్ళు తెరుద్దును గదా- చీకటి-

టైం చూసుకుంటే- తొమ్మిది దాటింది. 'అరె! ఇదేమిటి ఇట్టా నిద్రపట్టింది?' అనుకుంటూ లేచి- చల్లటి నీళ్ళలో ముఖం కడుక్కొని- టవలుతో గట్టిగా తుడుచుకొని బయటకు నడిచాను. శ్రీమతి ఎదురయి'చపాతీ' రడీగా ఉంది. మీకు ఇష్టమని క్యారెట్ హల్వా కూడా చేశాను అంది పిల్లలకు టాయిలం కబుర్లు చెప్పి మచ్చిక చేసుకున్నట్టు.

'వీటితోనే సరిపుచ్చుకోవాలా?' అన్నాను.

'మీ ఇష్టం' అంది ఎదురుగా వెళ్ళి నడుం చుట్టూ చేతులు బిగించి కదలనియ్యలేదు.

'ఇది అడిగే చేస్తున్నావా?' అంది విడిపించుకొనే ప్రయత్నం చేస్తూ

ఇంకా బిగించి- గట్టిగా ముద్దిచ్చి వదిలేశాను.

'ఏంటిదీ!' ఛీ అంటూ పైట చెరగుతో పెదాలు తుడుచుకొని లోనికి నడిచింది.

నేను శ్రీమతి వెంటే లోనికి నడిచి డైనింగు టేబుల్ దగ్గర చేరి తినేందుకుపక్రమించాను. ఇంకా పూర్తి కాలేదు. రుచిగా ఉండడాన నింపాదిగా లాగిస్తున్నాను.

'గోరుముద్దలు తినిపించేవారట! వెనకటి కాలంలో- భర్తలకు ఇప్పడా ఛాన్సు లేదంటావా?' అని 'మంచి భార్యలు తినిపిస్తారు. కాలంతో పనేముంది.



మిగతా 120వ పేజీలో

100వ పేజీ తరువాయి

వాళ్లకా మాత్రం తెలీకపోతదంటావా?' అన్నాను.

విననట్లుగా వంటింట్లోకెళ్ళింది.

'డాక్టరు బాబూ' అన్న పిలుపు వినిపించిందింతలో.

'ఆ! ఆ గొంతు మరియదాసుదే!' అనిపించి లేచాను.

చేయి కదుక్కుని వరండాలోకొచ్చాను.

మరియదాసే గేటు తెరచుకొని లోనికొస్తూ కనిపించాడు. అతని చేతులలో ఓ ఆడకూతురుంది. దగ్గరకొచ్చాను. నెలలు నిండిన మనిషిగా అర్థమయింది. స్పృహలో ఉన్నట్లుగ అనిపించలేదు. చేయి పట్టుకొని నాడి చూస్తూ 'ఏమిటిది దాసూ' అన్నాను.

'నా బిడ్డ బాబూ తొమ్మిదో నెల గడుస్తున్నదని పురిటికి తీసుకొచ్చిన- నాకాడ చూపించాలని, పొద్దుట నేను పనికిపోయిన! పగలు నుంచీ నొప్పలట నీలాడతంటే' అని అక్కడే ఉంచినారు అమ్మలక్కలు! కానీ- నొప్పలు ఆగిపోయినయ్! పొద్దుగూకాక మళ్ళీ నొప్పలు!

మెలితిరిగిపోతన్నది! సోయి తప్పింది- నీ కాడకొస్తుంటే' అన్నాడు గొంతు జీరబోయింది.

పక్కనున్న మంత్రసాని. పొట్ట పట్టుకుని చూసి పిండం అడ్డం తిరిగినట్టుండది దాసూ! ఇక్కడ వద్దు అమాంతం ఎత్తుకొని- లగెత్తుకొచ్చిన నువ్వు ఉన్నాక నాకున్న భయమేంది?

'నీ చెయ్యి తగిలితే చాలు బాబూ! మంచి జరుగుతది' అన్నాడు.

మరియదాసు కళ్ళెంట నీరుంది. కానీ-కొండంత ధైర్యమూ కనిపించింది.

మాటాడుతుంటే ఏడపుతో గొంతుక పూడుకపోయి కనిపించింది- కన్నబిడ్డపై నున్న మమకారం మరియదాసు కాలాడనియ్యడం లేదు.

అతని నమ్మకానికి! నా మనస్సెలాగో అయింది.

పిల్లదాన్ని బల్లపై దింపి మోకాళ్ళపై కూర్చుని కండువాతో కళ్ళు వత్తుకున్నాడు నా వైపే చూస్తూ.

'దాసు! ఏంటది?' అని పిల్ల పొత్తికడుపుభాగాన్ని పరీక్షించాను.

పిండం నిజంగానే అడ్డు తిరిగినట్లు- అర్థమైంది. బిడ్డలో కదలిక కూడా అంతగా కనిపించలేదు. నా గుండె కలుక్కుమంది. ఆపరేషన్ చేయక తప్పదు.

కానీ- తనకు ఈ విభాగాన అంతగా అనుభవం లేదు- అయినా 'మొదట ఆసుపత్రికి పద' అన్నాను- నేను బయలుదేరుతూ.

మరియదాసు అమాంతంగా బిడ్డనెత్తుకొని బయలుదేరాడు.

నేను ఊళ్ళో ఉన్న లేడీడాక్టర్ మణి కోసం ఫోనుచేశాను. ఆవిడ ఊళ్ళోలేదని చెప్పారు.

నర్సు అయినా ఉందేమోనని ప్రయత్నిస్తే ఆవిడా రేపు వస్తుందన్నారు. ఇక లాభం లేదనుకొని స్కూటరెక్కి ఆసుపత్రికి వచ్చాను. ఆసుపత్రిన ఉన్న ఓ చెట్టు క్రింద బిడ్డనుంచి నాకోసం ఎదురుచూస్తున్నాడు దాసు

నేను దాసు ఎదురుగ ఆగి 'దాసూ! బిడ్డ పరిస్థితి బాగాలేదు! ఏదైనా ఆటో పిలుచుకొని త్వరగా ఖమ్మం తీసుకెళ్దువుగాని! నేను ఉత్తరం వ్రాసిస్తాను!' అన్నాను.

నావైపు అదోలా చూసి 'నేనేడికీపోను బాబూ! నువ్వే చెయ్యి! అంత బాగానే అయితది!' అన్నాడు స్థిరంగా. మోకాళ్ళపై కూర్చుని దండం పెడుతూ.

'దాసూ! నా మాట విను. ఇది నేను చేయగల్గిన కేసు కాదు. ఆలస్యం అయితే తల్లికీ, పిల్లకూ కూడా మంచిది గాదు!' అన్నాను.

'మీరే చేయాల బాబూ' అన్నాడు మొండిగ.

'నేనెందుకు చెప్తున్నానో అర్థం చేసుకో' అని గద్దించాను.

'నువ్వుండగ నేనేడికీ పోత డాక్టరు బాబూ! నువ్వే దేవుడవు- నా బిడ్డకేం గాదు- నువ్వు చూడు' అన్నాడు దండం పెడుతూ మొండిగా.

మరియదాసు పరిస్థితి అర్థమైంది! పొరుగూరునందున బాలవాడి నర్సు నన్ను ఎక్కించుకొని వద్దామని స్కూటరు స్టార్టు చేశాను! నేను తిరిగి వచ్చేసరికి- దాదాపు అరగంట దాటింది.

గేటు దాటాను.

ఎదురుగ ఉన్న చెట్టు కింద మరియదాసే కన్నబిడ్డకు పురుదు పోస్తుండడం కనిపించి ఆగిపోయాను. నా మతిపోయింది. స్కూటరు దిగి బ్యాటరీ వెలిగించి గబగబా దాపుకెళ్ళాను.

మరియదాసు బిడ్డపై ఏ ఆచ్ఛాదన లేదు. అప్పటికే బిడ్డ గర్భాన ఉన్న శిశువు తలను బైటకు లాగాడు.

'దాసూ! ఆగు' అని నేను వెళ్ళి ప్రక్కన కూర్చుని టార్చి దాసుకిచ్చి నెమ్మదిగా నర్సు సాయంతో బైటకు గుంజాను. బొడ్డు కత్తిరించాను. బిడ్డ కేర్‌మంది! నా మనస్సు మనస్సున కుదుటపడింది. తల్లీ పిల్లా క్షేమంగానే వుండడం చిత్రంగా అనిపించింది. అరక్షణం అట్టాగే ఉండిపోయాను.

దాసు కూతురుకు గుడ్డ కట్టి ఆసుపత్రిలోనకు చేర్చాను.

'నే చెప్పలేదా బాబూ! నా బిడ్డకేం గాదని! నీది చల్లటిచెయ్యి!' అని నా చేతిని పట్టుకొని ముద్దెట్టుకొని కళ్ళకద్దుకున్నాడు మరియదాసు-

స్పృహలో లేకున్నా బిడ్డను కనగానే చేపు అందుకున్న పాలిండ్లు.

కలి నీళ్ళు పడగానే కేర్‌మని చనుబాలకై పసివాడు పడే ఆరాటం.

అమృతమయంగా అనిపించింది. నా మనస్సు ఆనందంతో గెంతింది.

ఏమిటది? నిజంగా దీన్నేమందాం? అన్న ఆలోచన నన్ను తికమక చేసింది.

తెల్లవారిందాకా, నేను వారి చెంతనే ఉన్నాను. మరియదాసూ మోకాళ్ళపై కూర్చుని అలాగే ఉన్నాడు. సూర్యోదయంతో స్పృహ వచ్చిన తల్లి. కన్నబిడ్డను నిండుగా చూసుకొని చనుకట్టు దిశగా జరుపుకుంది. పట్టరాని ఆనందం మరియదాసును తబ్బిబ్బు చేసింది. దాసు భుజం తట్టి బయటకు నడిచాను.

మరియదాసు నమ్మికే తల్లీబిడ్డల్ని బ్రతికించింది.

## అంతులేని విజ్ఞాన సంపద



విజ్ఞానానికి, సాహిత్యాభిలాషకు నేను ఎన్నో గ్రంథాలను సేకరించ గలిగాను. 23 రామాయణాలు నా దగ్గరున్నాయి. గ్రంథాలు చదువుతుంటే ఎన్నో రకాలుగా మన మనస్సు వికసించి విస్మయపరుస్తుందో చెప్పలేను. చదివిన కొలది చదవాలనిపిస్తూ, రకరకాల భాష్యాలతో వెలువడిన ఈ సాహిత్య పరంపర జీర్ణం చేసుకుంటే ఎంతటి విజ్ఞానం లభిస్తుందో చెప్పలేను.

- ఎన్ టి రామారావు

(ఆంధ్రజ్యోతి వార పత్రిక 20-2-70 లోని ఇంటర్వ్యూ నుంచి)